క్లుప్తంగా

బీమా చెక్కుల పంపిణీ




బీమా చెక్కులు అందిస్తున్న మజ్జివలస పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస పీఏసీఎస్ సభ్యులు గాదిపిల్లి పాపారావు, గాదిపిల్లి నారాయణ కుటుంబాలకు సోమవారం పాలకవర్గం రూ.15వేలు వంతున బీమా చెక్కులు అందించింది. కొద్దిరోజుల క్రితం ఇరువురు సభ్యులు వివిధ కారణాలతో మృతి చెందడంతో పరిహారం కింద ఈ మొత్తాలను అందించారు. కార్యక్రమంలో భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు చెల్లూరి పైడప్పడు, డైరెక్టర్లు గాడు తాతినాయుడు, తుపాకుల అప్పలస్వామి, సొసైటీ కార్యదర్శి గల్లా రామకృష్ణ, డొప్ప ఎర్రయ్య, సచివాలయ కన్వీనర్ కొయ్య రామకృష్ణ పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల వితరణ

భీమునిపట్నం: లయన్స్ క్లబ్ భీమిలి గ్రేటర్ ఆధ్వర్యంలో నేరెళ్లవలస కాలనీలో పేదలకు అధ్యక్షులు జి.సన్యాసిరావు సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం జిల్లా లయన్స్ గవర్నర్ గోపాలరావుతో కలిసి కృష్ణాకాలనీ కొండపైనున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో మొక్కలు నాటారు. లయన్స్ కార్యదర్శి సీహెచ్.గౌరినాయుడు, కోశాధికారి వాసుపల్లి ఎల్లాజీరావు, సభ్యులు మైలిపల్లి షణ్ముఖరావు, కూరాకుల మురళి, చిన్నయ్య పాత్రుడు, కొత్త రామకృష్ణ పాల్గొన్నారు.

ఉమా సిద్ధేశ్వరునికి పూజలు



అలంకరణలో ఉమా సిద్ధేశ్వర స్వామి

పీఎం పాలెం: పీఎం పాలెం ఆఖరు బస్టాపు నుంచి బక్కన్నపాలెం వెళ్లే రోడ్డులో గల శ్రీ శృంగేరీ శంకరమఠంలో శ్రీ ఉమా సిద్ధేశ్వర స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



బొట్టా మౌళి

పద్మనాభం: మండలంలోని నేరెళ్లవలస గ్రామానికి చెందిన 16 ఏళ్ల ఇంటర్మీడియట్ విద్యార్థి బొట్టా మౌళి ఆదివారం రాత్రి ఒంటి గంట సమయంలో ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. దీనిపై విద్యార్థి తండ్రి అప్పలనాయుడు సోమవారం పద్మనాభం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 5.5 అడుగుల పొడవు కలిగిన మౌళి ఇంటి నుంచి వెళ్లిపోయినప్పుడు నల్ల షర్టు, నల్లటి ట్రాక్ షూట్ ధరించి ఉన్నాడు. ఈ కేసును హెడ్ కానిస్టేబుల్ కన్నారావు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి

దాబాగార్డెన్స్ : ప్రముఖ చలన చిత్ర కథానాయకులు చిరంజీవి, బాలకృష్ణ నటించిన పలు చిత్రాల గీతాలతో సోమవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. స్వర గీతిక సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కళారంగ ప్రముఖులు భయ్యా శ్రీనివాస్, సన్‌మూర్తి, సంస్థ వ్యవస్థాపకుడు రాజారావు, శ్యాంసుందర్ ప్రారంభించారు. లోకేష్ ట్రాక్స్ సహకారం అందివ్వగా, లక్ష్మీ స్వరూప వ్యాఖ్యానం చేశారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు మహదేవ మూర్తి, బొమ్మిడి సత్యనారాయణ, కేవీఎల్ రావు, వేణుగోపాల్, వీవీఎస్ మూర్తి, జిలాని, శ్యాంసుందర్, రామ్ కుమార్, మాధవ్, వెంకటేష్, అభినయ్, మాధురి, లక్ష్మీ సాత్విక, గౌరీ, సుజాత, లాయర్ శ్రీదేవి, లక్ష్మీ స్వరూప తదితరులు గీతాలాపన చేశారు.

అర్జీల పరిష్కారంలో అప్రమత్తత అవసరం

జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి



జెడ్సీకి సమస్యలు వివరిస్తున్న పీఎం పాలెం గాయత్రినగర్ వాసులు

మధురవాడ: స్పందన అర్జీల పరిష్కారంలో అధికారులు, సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ జోన్ – 2 జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి సూచించారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో భాగంగా అధికారులతో ఆమె మాట్లాడారు. బియాండ్ ఎస్ఎల్ఏ ఫైల్స్, జగనన్నకు చెబుదాం తదితర ఫిర్యాదుల విభాగంలో వచ్చిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని కోరారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల భగవాన్ దాస్ కాలనీకి చెందిన చెంచు కృష్ణ అనే ఫిర్యాదుదారుడు ప్రోపర్టీ ట్యాక్స్‌కు సంబంధించిన వ్యవహారంలో చేసుకున్న దరకాస్తు పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 40వ వార్డు అడ్మిన్ జి.ఈశ్వరరావుని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారని, అలాగే బొట్టవానిపాలెంకి చెందిన రావాడ ఎరుకునాయుడు అనే వ్యక్తి కూడా ప్రాపర్టీ ట్యాక్స్‌కి సంబంధించిన ఫిర్యాదు పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు అసిస్టెంట్ కమిషనర్ రమేష్ మెమో జారీ చేశారని చెప్పారు. అందువల్ల ప్రతి ఒక్కరూ స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

మధురవాడ: స్పందనలో వచ్చిన అర్జీల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని జీవీఎంసీ జోన్ – 2 కమిషనర్ కె.కనక మహాలక్ష్మి చెప్పారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పలు వార్డులకు చెందిన వివిధ ప్రాంతాల నుంచి 17 అర్జీలు అందాయి. టౌన్ ప్లానింగ్ విభాగానికి – 4, పబ్లిక్ హెల్త్ – 4, ఇంజినీరింగ్ వర్క్ – 4, ఎలక్ట్రికల్, రెవెన్యూ – 3 చొప్పున, నీటి సరఫరా విభాగానికి రెండు ఫిర్యాదులు అందాయి. పీఎం పాలెం గాయత్రినగర్‌లో 16వ బ్లాక్ వద్ద బోర్‌వెల్ వేసి దానికి బేస్‌మెంట్ నిర్మించలేదని, 12, 14 బ్లాకుల వద్ద కొత్త బోర్లు వేయాలని, వీధిలైట్లు వెలగక ఇబ్బందులు పడుతున్నామని ఎం.అప్పలరాజు తదితరులు కోరారు. కొమ్మాది రిక్షా కాలనీలో గల ఏపీ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల సీవోకి చెందిన కాంపౌండ్ వాల్ పబ్లిక్ డ్రైనేజీ ప్రవాహం వల్ల కూలిపోయి, మురుగునీరు గ్రౌండ్‌లోకి వచ్చేస్తుందని, చర్యలు చేపట్టాలని ప్రిన్సిపాల్ టి.నాగమణి కోరారు. డి.మార్టు పక్కన నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌పై చర్యలు తీసుకోవాలని వై.సుందరరావు కోరారు. ఫిర్యాదులపై తక్షణ చర్యలు చేపడతామని జెడ్సీ హామీ ఇచ్చారు.

భీమునిపట్నం: స్థానిక జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందనకు మూడు వినతులు వచ్చాయి. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రెండు, పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఒక వినతి వచ్చింది. వీటిని త్వరలో పరిష్కరిస్తామని జెడ్సీ రాము తెలిపారు.

పేద కుటుంబానికి పెద్ద కష్టం

- నాలుగేళ్ల బాలుడికి బ్లడ్ క్యాన్సర్
- దాతల సాయం కోసం ఎదురు చూపు



చికిత్స పొందుతున్న బాలుడు బాలాజీ



బాలాజీతో తల్లిదండ్రులు దుర్గా ప్రసాద్, భవానీ

ఆనందపురం : వారిది రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం.. రోజూ కూలి చేసుకుంటూ అద్దె ఇంట్లో ఉంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ప్రేమ వివాహంతో ఒక్కటైన ఆ దంపతులకు ఆస్తులు, అంతస్తులు లేకపోయినా ఉన్న ఇద్దరు బిడ్డలే సర్వస్వం అనుకొని అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. విధికి కన్ను కుట్టిందో ఏమో గానీ ఆ కుటుంబంలో ఒక బాలుడికి క్యాన్సర్ రూపంలో అనారోగ్యం సోకింది. దీంతో ఆ పేద కుటుంబం తల్లడిల్లుతూ ఆదుకునే వారి కోసం ఎదురు చూస్తోంది. మండలంలోని ఆనందపురం కాలనీలో నివసిస్తున్న ఆవాల దుర్గాప్రసాద్, భవానీకి ఇద్దరు కుమారులు సంతానం. దుర్గా ప్రసాద్ వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భవానీ ఇంటి వద్దే ఉండి పిల్లల ఆలనాపాలనా చూసుకుంటోంది. కాగా వారి పెద్ద కుమారుడు బాలాజీ (4)కి ఇటీవల జ్వరం సోకింది. వైద్యులకు చూపించినా తగ్గకపోవడంతో గీతం ఆస్పత్రిలో పరీక్షలు చేయించగా అక్కడి వైద్యులు బ్లడ్ క్యాన్సర్‌గా తేల్చారు. దీంతో తీవ్ర ఆందోళనకు గురై తల్లడిల్లిన తల్లిదండ్రులు గత నెల 31న ఎంవీపీ కాలనీలోని మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారు. కాగా అక్కడ బాలాజీకి ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందిస్తున్నా ప్లేట్‌లెట్స్, రక్తం కోసం వాటి విలువులో సగం నగదు చెల్లించాల్సి వస్తోంది.

అవసరమైతే మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతాల ఆస్పత్రులకు తీసుకెళ్లాల్సి వస్తుందని వైద్యులు అంటున్నారని తెలుపుతూ రోదిస్తున్నారు. చేతిలో చిల్లిగవ్వలేని వారికి తలకు మించిన భారంగా మారడంతో ఆదుకునే వారి కోసం దీనంగా ఎదురు చూస్తున్నారు. బాలుడికి ప్లేట్‌లెట్స్, రక్తం ఇతర మందులు కొనుగోలుకు దాతలు సాయం చేయాలని వారు వేడుకుంటున్నారు. సాయం చేయదలచిన వారు 9052782447 నంబరులో సంప్రదించాలని అభ్యర్థిస్తున్నారు.

కొత్తూరులో డ్రైనేజీ నిర్మాణం



కొత్తూరులో నిర్మిస్తున్న ఓపెన్ డ్రైనేజీ

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ కొత్తూరులో రూ.20 లక్షలతో చేపడుతున్న ఓపెన్ డ్రైనేజీ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు నాసిరకంగా సాగడంతో ఎక్కడికక్కడ మురుగు నీరు నిలిచిపోయేది. దీంతో ఈ సమస్యను గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకురాగా గొల్లవీధి, కొత్తూరులో డ్రైనేజీల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ రావడంతో శరవేగంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయని 10వ వార్డు సభ్యుడు పూసర్ల రామారావు తెలిపారు. సోమవారం ఆయన పనులను పర్యవేక్షించారు. సర్పంచ్ పాట్నూరు ఛాయాగౌతమి, ఎంపీటీసీ సభ్యురాలు పల్లా నీలిమ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, వార్డు సభ్యుడు తమ్మిన నరేంద్ర, పార్టీ అధ్యక్షుడు బాయిన మంగరాజులకు రామారావుకు ధన్యవాదాలు తెలిపారు.

యాగశాల ప్రారంభం



మధురవాడలో యాగం నిర్వహిస్తున్న అర్చకులు

మధురవాడ: స్థానిక సిద్ధేశ్వర పీఠంలో భక్తిశ్రద్ధలతో సోమవారం యాగశాల ప్రారంభించారు. పీఠంలో చంద్రంపాలెం హైస్కూల్ వైపు ఓ భక్తుడి కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో నిర్మించిన యాగశాలను వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా ధర్మకర్త నరసింహమూర్తి తదితరులు ప్రారంభించారు. అర్చకులు దూసి రామలింగ స్వామి, సత్యశ్రీనివాస్ శర్మ తదితరులు గణపతి హోమం నిర్వహించారు. దాతలు దర్మేంద్ర కృష్ణ, భాగ్యలక్ష్మి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

సెల్ టవర్ నిర్మాణం ప్రారంభం



సెల్ టవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ రాజు

ఆనందపురం : మారుమూలన ఉన్న రామవరంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు త్వరలోనే సెల్ ఫోన్ సిగ్నల్‌తోపాటు ఇంటర్నెట్ సమస్య తీరనుంది. ప్రతి గ్రామానికి ఇంటర్నెట్‌తోపాటు, సెల్ సిగ్నల్స్ అందాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవ తీసుకున్నారు. దీంతో బీఎస్ఎన్ఎల్ అధికారులతో చర్చించగా కేంద్ర ప్రభుత్వం సెల్ టవర్‌ను రామవరం గ్రామానికి మంజూరు చేసింది. ఈ మేరకు స్థానిక సర్పంచ్ యర్ర రాజు పనుల ప్రారంభానికి భూమి పూజ చేశారు. జాతీయ రహదారికి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలోనే రామవరం గ్రామం ఉన్నా చుట్టూ కొండలు ఉండడంతో ఏ నెట్‌వర్క్ సెల్ సిగ్నల్స్ కూడా అందని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం అన్ని సంక్షేమ పథకాలను ప్రభుత్వం ఆన్‌లైన్‌లోనే అందించడంతోపాటు ప్రతి లబ్ధిదారుడి మొబైల్‌కు సమాచారాన్ని అధికారులు చేరవేస్తున్నారు. కాగా ఇక్కడ సెల్ సిగ్నల్స్ అందక పోవడంతో లబ్ధిదారులతోపాటు, సచివాలయ సిబ్బంది విధులు నిర్వహించడానికి అష్టకష్టాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధికారులతో మాట్లాడి బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌ను మంజూరు చేయించారు. ఏజీఎం శ్రీకాంత్ పట్నాయిక్ పనులను ప్రారంభించారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



ఫ్లైఓవర్‌పై వై జంక్షన్ వద్ద పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

ఆనందపురం : ఆనందపురం జంక్షన్‌లోని ఫ్లైఓవర్‌పై గల వై జంక్షన్‌ను ట్రాఫిక్, శాంతి భద్రతల విభాగం అధికారులు సోమవారం సాయంత్రం పరిశీలించారు. శాంతి భద్రతల విభాగం డీసీపీ – 1 వి.విద్యాసాగర్ నాయుడు, ట్రాఫిక్ ఏసీపీ జాన్ మనోహర్, ఏడీసీపీ జి.శ్రీనివాసరావు, ఆనందపురం సీఐ రామచంద్రరావు, ట్రాఫిక్ ఎస్ఐ రఘురామ్ జాతీయ రహదారిపై పర్యటించి వాహనాల రాకపోకలను పరిశీలించారు. ముఖ్యంగా విజయనగరం, శ్రీకాకుళం, తగరపువలస ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు... ఇక్కడి వై జంక్షన్ వద్ద విశాఖ వెళ్లే వాహనాలు ఎడమవైపు రహదారిలోకి, పెందుర్తి, అనకాపల్లి వెళ్లే వాహనాలు కుడివైపు గల రహదారి గుండా ప్రయాణించాల్సి ఉంది. కానీ ఇక్కడ సరైన సూచికలు గానీ, నియంత్రించేందుకు సిబ్బంది లేకపోవడంతో అంతా గందరగోళంగా మారతోంది. దీంతో విశాఖ వెళ్లాల్సిన చాలా మంది వాహనదారులు తికమకకు గురై పెందుర్తి మార్గంలోకి ప్రవేశిస్తున్నారు. చాలా దూరం వెళ్లిన తర్వాతగానీ వారికి అసలు విషయం తెలియడం లేదు. దీంతో వారు మరలా అదే మార్గంలో వెనక్కి రావడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. ఇటీవల ఇక్కడ ఇలాగే రెండు మూడు ప్రమాదాలు కూడా జరిగాయి. దీంతో పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించి ఇక్కడ ట్రాఫిక్‌ను పూర్తి స్థాయిలో క్రమబద్ధీకరించడానికి నిర్ణయించారు. ఈ మేరకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రత్యేకించి వాహనదారులకు రవాణా మార్గాలపై పూర్తిగా అవగాహన కలిగేవిధంగా సూచిక బోర్డులను ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోనున్నట్టు అధికారులు వెల్లడించారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

తగరపువలస: భీమిలి జోన్‌లో మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించడంలో జీవీఎంసీ అధికారులు విఫలమయ్యారని టీడీపీ విశాఖ పార్లమెంట్ కార్యదర్శి పిట్టా సురేష్ ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ చిట్టివలస నుంచి బ్యాంకు కాలనీ వరకు తరచూ పైప్‌లైన్ మరమ్మతులకు గురవుతుండడం వల్ల రహదారులు చెరువులుగా మారుతున్నాయన్నారు. కొండపేట శివాలయం ముందు తవ్వి ఉంచిన గోతిలో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు పెరిగి దుర్వాసన వస్తోందన్నారు. చాలా చోట్ల విద్యుత్ స్తంభాలు, పైప్‌లైన్ మరమ్మతుల కోసం తీసిన గోతులు ఇప్పటికీ పూడ్చకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని... వాటిని వెంటనే సరిచేయాలని కోరారు.

గీతం డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ తెలిపారు. ఇంజినీరింగ్, ఎంబీఏ, బీబీఏ, బీకాం మేనేజ్‌మెంట్ కోర్సులకు, లా, ఆర్కిటెక్చర్, మెడికల్, ఫార్మసీ, ఫిజియోథెరపీ వంటి వృత్తి విద్యా కోర్సులతోపాటు ఎమ్మెస్సీ, బీఎస్సీ, బీఏ, ఎంఏ డిగ్రీ కోర్సులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇంటర్మీడియట్ తత్సమాన కోర్సులు పూర్తి చేసిన వారికి బీఎస్సీ బయోటెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, స్టాటస్టిక్స్, బీసీఏ, ఫిజియోథెరపీ, బీ ఫార్మసీ, బీఏ, ఎల్ఎల్‌బీ, బీబీఏ, బీఏలో ఎకనామిక్స్, హిస్టరీ, ఇంగ్లిష్, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ కోర్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అలాగే డిగ్రీ తత్సమాన అర్హత గల వారికి ఎమ్మెస్సీ డేటా సైన్స్, బయో టెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైక్రో బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథమేటిక్స్, ఎంఏ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు అడ్మిషన్ విభాగాన్ని సంప్రదించాలని కోరారు.

నెమలి పింఛాలతో అలంకరణ



తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు సంతపేట, కొత్తపేట గ్రామాల దేవత కొత్తమ్మతల్లిని సోమవారం సాయంత్రం నెమలిపింఛాలు, పువ్వులతో అలంకరించారు. ఈ ప్రత్యేక అలంకరణతో మంగళవారం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించనున్నారు. ఈ అలంకరణకు అంబేడ్కర్ కూడలిలోని పీపీఆర్ గుప్తా బుక్స్ అండ్ జనరల్ స్టోర్‌కు చెందిన పలివెల రాజశేఖర్, లలిత దంపతులు సహాయ సహకారాలు అందించారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో భీమిలి మండలం చిప్పాడ, తాళ్లవలసకు చెందిన సాడి కుమార్, వెంపాడ రామిరెడ్డి, బోని ఈశ్వరరావు అమ్మవారిని అలంకరించారు.

అంకుర సంస్థలకు ఆ హబ్ ఆర్థిక సహకారం

ఏయూక్యాంపస్: యువత స్థాపించి, నిర్వహిస్తు న్న అంకుర సంస్థలు (స్టార్టప్)లకు ఆర్థిక సహకారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఏయూ ఆ హబ్ సీఈవో రవి ఈశ్వరపు ఒక ప్రకటనలో తెలిపారు. భారత శాస్త్ర సాంకేతిక విభాగం ఏర్పాటు చేసిన నిధి పథకంలో భాగంగా యువత ఆలోచనలు ఆవిష్కరణలు గా, ఉత్పత్తులుగా మార్చడానికి అవసరమైన మూలధనం పెట్టుబడిని అందిస్తామని పేర్కొన్నారు. పథకంలో భాగంగా కనిష్ఠంగా రూ.2 లక్షలు, గరిష్ఠంగా రూ.10 లక్షలు అందిస్తామని తెలిపారు. టెక్నాలజీ, సైన్స్ ఆధారంగా పనిచేసే అంకుర సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. సాంకేతికత ఆధారిత ఆవిష్కరణలకు ఫొటోటైప్ ఉత్పత్తిని 12 నెలల్లో తీసుకురావాల్సి ఉంటుందన్నారు. దీనికి ఐవోటీ అనుసంధానం తప్పనిసరి అన్నారు. వివరాలకు ఇంజినీరింగ్ కళాశాలలోని ఆ హబ్‌లో నెలకొల్పిన నిధి ఐటీబీఐ కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.


వలందపేట సమస్యలపై వినతి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు వలందపేటలో సమస్యల పరిష్కారానికి సోమవారం స్పందనలో వినతిపత్రం అందించినట్టు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చిల్ల సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించినప్పుడు ఇక్కడి సమస్యలు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన తెలిపారు. నమ్మివానిపేట నుంచి జాతీయ రహదారి సర్వీస్‌రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు వేయాలని కోరారు. ఇవి లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రజక కాలనీలో రూ.22 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మించాలన్నారు. కొన్ని విద్యుత్ స్తంభాల కారణంగా పొంచి ఉన్న ప్రమాదం నుంచి రక్షణకు వాటిని వేరేచోటకు మార్చాల్సి ఉందన్నారు. ఆదర్శనగర్ – 2 పరిధిలో వలందపేట బోయి నరసింహులు ఇంటి నుంచి పాలధార పుట్ట వరకు డ్రైనేజీ నిర్మించాలని కోరారు. గ్రామకంఠంలో ఉన్న ఇళ్లకు ఇంటి పన్నులు లేక ఇక్కడి ప్రజలు ఇబ్బంది పడుతున్నందున వీటిని పూర్తి చేయాలని కోరారు.

రేపటి నుంచి తెలుగు భాషా వారోత్సవాలు

ఏయూ క్యాంపస్: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్ర విశ్వకళాపరిషత్, తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి తెలుగు భాషా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు తెలిపారు. ఆగస్టు 29న కళాప్రపూర్ణ గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని బుధవారం నుంచి 29 వరకు రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులను భాగస్వాములను చేస్తూ వివిధ మేధోపోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 23న వ్యాసరచన పోటీలు, 24న వక్తృత్వ పోటీలు, 25న పద్యపఠనం, 26న తెలుగు భాషా సాహిత్యాలపై క్విజ్, 27న నిష్ణాతులైన భాషా సాహిత్యవేత్తలతో చర్చా గోష్ఠి, 28న సోమవారం గిడుగు రామమూర్తి రచనలపై ఉపన్యాసాలు, 29న ముగింపు కార్యక్రమం ఉంటాయని తెలియజేశారు. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, విశిష్ట అతిథులుగా ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య జి.యోహాన్ బాబు, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ డి.వి సూర్యారావు, పరవస్తు ఫణిశయనసూరి హాజరవుతారని వివరించారు.

మహిళా కళాశాలలో స్టూడెంట్ ఇండక్షన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి

దాబాగార్డెన్స్ : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థినులకు సోమవారం స్టూడెంట్ ఇండక్షన్ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి నిర్వహించారు. కళాశాల ఆవరణ, మౌలిక సదుపాయాలు, సంస్కృతిని ఈ సందర్భంగా పరిచయం చేశారు. ఈ కార్యక్రమం సీనియర్ విద్యార్థులు, అధ్యాపకులతో సత్సంబంధాలు ఏర్పరచుకోవడానికి సహాయం చేస్తుందని ప్రిన్సిపాల్ వివరించారు. తొలి రోజు కార్యక్రమంలో భాగంగా అధ్యాపకుల ద్వారా ఫ్రెషర్స్‌కు స్వాగతం పలకడం, విద్యార్థినులకు సంబంధిత సిబ్బందితో పరిచయ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సంస్థ దృక్పథం, సంస్థాగత విధానాలు, విలువలతో కూడిన విద్య గురించి తెలిపారు. ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డి. అరుణపద్మ నేతృత్వంలో ఎన్ఈపీ, సీబీసీఎస్ నిర్మాణం, సింగిల్ మేజర్ సిస్టమ్‌లోని పాఠ్యాంశాలు, మూల్యాంకన విధానాల గురించి వివరించారు. కెమిస్ట్రీ విభాగాధిపతి సంతోషి అనూష విద్యార్థులకు ప్రవర్తనా నియమావళి గురించి తెలపగా, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్మయి, లైబ్రేరియన్ డాక్టర్ ఎ. ధరణి కళాశాల ఆవరణలో గల వివిధ విభాగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమం 21 రోజుల పాటు కొనసాగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

సందర్శకులతో మర్యాదగా ప్రవర్తించాలి



బీచ్ ఫొటోగ్రాఫర్లతో మాట్లాడుతున్న సీఐ రమేష్

భీమునిపట్నం: భీమిలి తీరానికి వచ్చే సందర్శకులతో బీచ్ ఫొటోగ్రాఫర్లు మర్యాదగా ప్రవర్తించాలని సీఐ డి.రమేష్ సూచించారు. బీచ్‌లో సందర్శకులకు ఫొటోలు తీస్తూ ఉపాధి పొందుతున్న ఫొటోగ్రాఫర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇక్కడకు వచ్చే వారి అనుమతి తీసుకున్న తర్వాతే ఫొటోలు తీయాలని సూచించారు. అలాకాకుండా ముందుగానే ఫొటోలు తీసి వారి వద్ద డబ్బులు డిమాండ్ చేయవద్దన్నారు. అలా చేసినట్టు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సందర్శకులతో దురుసుగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ముఖ్యంగా బీచ్‌లో తీసే ఫొటోలను వేరే విధంగా ఉపయోగించి దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బీచ్ పరిసరాల్లో ఎవరైనా మద్యం సేవించినా, అనుమానాస్పదంగా తిరుగుతున్నా తమకు సమాచారం అందించాలని కోరారు. ఎస్ఐలు హరీష్, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

కొనసాగుతున్న శ్రావణలక్ష్మి పూజలు

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు సోమవారం ఐదో రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో కె.శిరీష తెలిపారు. ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వర రావు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

మధురవాడ: వినియోగదారులు తమ విద్యుత్ కనెక్షన్‌కి ఆధార్ నంబర్ అనుసంధానం చేసుకోవాలని విశాఖ జోన్ – 3 ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు కోరారు. వినియోగదారులు తక్షణమే ఆధార్ అనుసంధానం కోసం ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్, ఈఆర్వో ఆఫీస్, సెక్షన్ ఆఫీసు, రెవెన్యూ క్యాషియర్ లేదా ఇతర విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాల్లో ఆధార్‌కార్డుతో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బందిని సంప్రదించాలని కోరారు.